
సాక్షి
గుంటూరు
ఆదివారం । 25 । మే । 2025



మాదిపాడులో రీ సర్వే

అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో శనివారం భూముల రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జానీబాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 512.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.

చందన అలంకరణలో వేణుగోపాలుడు



సత్తెనపల్లి: పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామి వారికి శనివారం చందనోత్సవ అలంకరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

న్యూస్‌రీల్

ఉచిత న్యాయ సహాయం పొందండి



నరసరావుపేటటౌన్: లైంగిక వేధింపులకు గురైన బాధితులు మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సహాయం పొందాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్. సత్యశ్రీ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పని ప్రదేశంలో లైగింక వేధింపులకు గురయితే జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశ పెట్టిన హెల్ప్ లైన్ నెం. 15100కు ఫిర్యాదు చేయాలన్నారు. అదే విధంగా జాతీయ మహిళా హెల్ప్‌లైన్ 78271 70170 నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లైగింక వేధింపుల చట్టం గురించి అవగాహన కల్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

31న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వ్యవసాయంపై 3వ స్థాయి సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. స్థాయీ సంఘ సమావేశాలకు ఆయా సంఘాల సభ్యులతో పాటు మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సీఈవో జ్యోతిబసు సూచించారు.

యోగాంధ్రపై విస్తృత ప్రచారం



నరసరావుపేట: యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అధికారులకు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండలస్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జూన్ 21 వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చేతన్యం కలిగించాలన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులకు, ఆయా రంగాల్లోని వారికి వివిధ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో యోగా శిక్షకులను గుర్తించి అభ్యాస కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో యోగా అభ్యాసకులకు ప్రజలను నమోదుచేసేందుకు కృషిచేయాలన్నారు. ప్రతిరోజు నరసరావుపేటతో పాటు మున్సిపాల్టీలు, మండలస్థాయిలో యోగా ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. డీఆర్‌ఓ ఏకా మురళి పాల్గొన్నారు.

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి



నరసరావుపేట: జిల్లాలో పిల్లలకు ఆటలమ్మ, రుబెల్లా వ్యాధులు సంక్రమించకుండా ఎంఆర్ వ్యాక్సిన్ కోసం తల్లిదండ్రులు సమీపంలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి కోరారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లాలో మీజిల్స్ రుబెల్లా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మూడు విడతలుగా ప్రత్యేక ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి 31వరకు, జూన్ 23 నుంచి 28వరకు, జూలై నెలలో 21 నుంచి 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ మొదటి డోసు తొమ్మిది నుంచి 12 నెలల మధ్య, రెండో డోసు 16 నెలల నుంచి 24 నెలల మధ్య వేయాలని పిల్లలకు వేయించాలని కోరారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో ఎంఆర్ వ్యాక్సిన్ మొదటి, రెండో డోసులు వేయించుకోని పిల్లలకు కూడా వ్యాక్సిన్ వేస్తారన్నారు.

చెరువు భూమి స్వాహా!

రాజధాని అమరావతిలో చెరువు భూమికి రెక్కలు వచ్చాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఒక డెప్యూటీ కలెక్టర్ ఈ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేయించారు. తమ వారి పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించేసుకున్నారు. ఫ్రీ హోల్డ్ విషయంలో గానీ, రిజిస్ట్రేషన్లు చేయించే విషయంలో గానీ నిబంధనలు పాటించలేదు. ప్రభుత్వం ఈ భూములపై నిషేధం విధించిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.

- నిబంధనలు పాటించకుండానే ఫ్రీ హోల్డ్
- అమరావతిలో చెరువు భూమికి రెక్కలు
- చక్రం తిప్పిన డెప్యూటీ కలెక్టర్
- డీఎల్‌ఆర్‌సీ మీటింగ్ జరగకుండానే ఆదేశాలు
- ప్రభుత్వం నిషేధం విధించిన తర్వాత రిజిస్ట్రేషన్లు
- రూ.కోట్ల విలువైన 15 ఎకరాలు బినామీ పేర్లతో హస్తగతం

'ఫ్రీ'గా పట్టేసి.. రూ.కోట్ల భూమి కాజేసిన ఉన్నతోద్యోగి



కర్లపూడిలోని చెరువు భూమి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పల్నాడు జిల్లా, అమరావతి మండలం, లేమల్లె గ్రామ శివారు అయిన కర్లపూడి గ్రామంలో సర్వే నెంబర్ 290లోని సుమారు 15 ఎకరాల చెరువు పోరంబోకు భూమి ఉంది. ఇందులో కొంతమంది పేదలకు గతంలో అసైన్ చేయగా, మరికొంత భూమిని ఇంకొందరు స్వాధీనంలో ఉంచుకున్నారు. కొంత మందికే పట్టాలు ఉన్నాయి. మిగిలిన వారిలో మరికొందరికి పాత తేదీలు వేసి నకిలీ పట్టాలు సృష్టించారు.

పాత తేదీలతో పక్కాగా నకిలీలు..

ఈ భూమి గుంటూరు నుంచి అమరావతి మెయిన్ రోడ్డు పక్కనే కర్లపూడి గ్రామంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉంటుంది. రాజధాని రావడంతో ఈ భూముల ధరలు కూడా పెరిగాయి. దీనిపై కన్నేసిన ఒక డెప్యూటీ కలెక్టర్ పల్నాడు జిల్లాలో పోస్టింగ్‌లో ఉన్న సమయంలో చక్రం తిప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఫ్రీ హోల్డ్ చేయించారు. అసైన్ భూములకు ఫ్రీ హోల్డ్ చేయాలంటే జిల్లా స్థాయి రెవెన్యూ కమిటీ (డీఎల్ ఆర్‌సీ)లో ఆమోదం పొందాలి. ఇవేమీ లేకుండానే తహసీల్దార్, ఆర్డీవో రిమార్కులతో ఆదేశాలు తెచ్చుకున్నారు. ఇచ్చిన ఆదేశాలలో కూడా చెరువు పోరంబోకును ఎందుకు ఫ్రీ హోల్డ్ చేస్తున్నారనే అంశాన్ని కూడా పొందుపరచలేదు. దీనికి సంబంధించిన నోట్ ఫైల్ కూడా లేదని చెబుతున్నారు. ఈ భూమిలో 19 మంది హక్కుదారులు ఉన్నట్లు చూపించారు. వీరిలో కొందరు రైతుల వద్ద పట్టాలు ఉన్నాయి. మరికొందరి వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. దీంతో గతంలో రెవెన్యూ విభాగంలో పనిచేసి రిటైర్ అయిన కొంతమంది అధికారులతో సంతకాలు పెట్టించి పాత స్టాంప్ పేపర్లపై సదరు సర్వే నెంబర్‌లోని రైతులకు పూర్వకాలంలోనే పట్టాలు వచ్చినట్లుగా నకిలీవి సృష్టించారని సమాచారం. వీటి ఆధారంగా సర్వేనెంబర్ 290లోని 15 ఎకరాలకు పూర్వకాలంలోనే పట్టాలు మంజూరు అయినట్లుగా రికార్డ్ తయారు చేశారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో ఫ్రీ హోల్డ్ జీవో ప్రకారం ఆదేశాలు తెచ్చుకున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్లకు ప్రణాళిక

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జూలై 7వ తేదీన ఫ్రీ హోల్డ్ అయిన భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీనిపై రాష్ట్ర స్థాయిలో కమిటీని సర్కారు నియమించింది. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడిగా, ఆ పార్టీ కోసం ఎంతో చేశానని చెప్పే సదరు డెప్యూటీ కలెక్టర్ తన పలుకుబడిని ఉపయోగించారు. ఆగస్టు 19వ తేదీన ఆ భూములకు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం విశేషం. అసలు లబ్ధిదారులకు నామమాత్రంగా డబ్బులు చెల్లించి ఒక సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఈ సంస్థలో సదరు డెప్యూటీ కలెక్టర్‌కు వాటాలు ఉన్నట్లు చెబుతున్నారు. తాజాగా ఈ భూమిలో వెంచర్లు వేసి రూ.కోట్లు సంపాదించేందుకు సీఆర్‌డీఏ అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపితే అసలు విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



మహేష్‌ను సత్కరించి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్య నేతల సమావేశం జరిగింది. పార్టీ జిల్లా పరిశీలకులుగా నియమితులై తొలిసారి గుంటూరు వచ్చిన పోతిన మహేష్‌కు నేతలు ఘన స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, విజయవాడ పార్లమెంట్ జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), అనుబంధ విభాగాల అధ్యక్షులు హాజరయ్యారు. జిల్లా పరిధిలోని పలు అంశాలకు సంబంధించి పూర్తి స్థాయిలో చర్చించారు. పార్టీని బలోపేతం చేసే దిశగా జిల్లా, నగర, నియోజకవర్గాల కమిటీల నియామకం త్వరితగతిన పూర్తి చేసేలా చర్చించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా పరిశీలకులుగా తనపై నమ్మకంతో నియమించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. జూన్ 4న జరిగే వెన్నుపోటు దినోత్సవానికి సంబంధించి మంగళగిరిలోని నియోజకవర్గంలో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు

పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి సర్కార్ సంవత్సర పాలనలో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. గతంలో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నారని, ఇప్పుడు ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని మండి పడ్డారు. ఈ ఏడాది కాలంలో కేవలం రాజకీయ కక్షలు, కార్పణ్యాలతో పాలన కొనసాగించారని పేర్కొన్నారు. జూన్ 4న వెన్నుపోటు దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. దానిలో భాగంగా ఈ నెల 30 నుంచి జూన్ 3వ తేదీ వరకు గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు– 1 , 2, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరిని సన్నద్ధం చేస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తిరిగి హామీ ఇచ్చిన ఏకైక సీఎం చంద్రబాబేనని ఎద్దేవా చేశారు. మిర్చి, పొగాకు, పత్తి రైతులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, సీడీ భగవాన్, ఈమని రాఘవరెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, తాడిబోయిన వేణు, విజయ్, నందేటి రాజేష్, మామిడి రాము, శేషగిరి పవన్‌కుమార్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాతలు

గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పలువురు దాతలు పెద్ద మనస్సుతో విరాళాలు అందిస్తున్నారు. ప్రిన్సిపల్‌గా డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి వచ్చిన ఆరు నెలల్లో చేస్తున్న కృషిని చూసి దాతలు సుమారు రూ. 4 కోట్ల విరాళాలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాలలు గుంటూరు కళాశాల ప్రగతిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ఉన్నతాధికారులు, నాయకులు మెచ్చుకుంటున్నారు.

- ఆరు నెలల్లో రూ. 4 కోట్ల విరాళాలు
- వైద్య కళాశాల అభివృద్ధికి చేయూత
- చురుగ్గా సాగుతున్న వివిధ పనులు
- ప్రిన్సిపల్ చొరవతో ముందుకొచ్చిన ప్రముఖులు
- నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణం
- విద్యార్థులకు రెండు కొత్త బస్సులు
- పలు లెక్చర్ గ్యాలరీల ఆధునికీకరణ



విరాళంగా అందజేసిన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ (ఫైల్)



నూతనంగా నిర్మించిన రహదారి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు జిల్లా ఓబులేశునిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి 1981లో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివారు. న్యూరాలజీలో పీజీ అయ్యాక 2001లో జీజీహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొంది నేడు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారు. అప్పటి నుంచి పీజీ వైద్య విద్యార్థులకు బోధన మెరుగుపడేందుకు చర్యలు తీసుకున్నారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో ఒకేసారి నాలుగు పీజీ సీట్లు వచ్చేలా చూశారు. పలుమార్లు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పీజీ పరీక్ష ఫలితాల్లో డాక్టర్ సుందరాచారి మార్గదర్శకత్వంలో పీజీ వైద్యులు ప్రథమ స్థానం గెలుచుకున్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా..

రాష్ట్రంలోనే ఉత్తమ న్యూరాలజీ విభాగంగా చేయడానికి డాక్టర్ సుందరాచారి కృషి చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా విభాగాన్ని తీర్చిదిద్దారు. ఉమ్మడి ఏపీలో ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో లేని విధంగా న్యూరాలజీ వార్డులో బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. చిలకలూరిపేటకు చెందిన ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ, పూర్వ విద్యార్థి డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు, రోటరీ క్లబ్ ఆఫ్ అమెరికా సహాయంతో రూ. కోటితో 2015లో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు. నిద్ర సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చెక్ పెట్టేలా స్లీప్‌ల్యాబ్‌ను సైతం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నాట్కో ఫార్మా సహాయంతో 2017లో జీజీహెచ్‌లో ఏర్పాటు చేయించారు. 2018 జూన్‌లో రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో లేని విధంగా న్యూరాలజీ విభాగానికి ఐఎస్‌ఓ గుర్తింపు లభించింది. 2023లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును ఆయన అందుకున్నారు. 2022లో ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీగా ఎన్నికయ్యారు.

కళాశాల అభివృద్ధిపై దృష్టి

డాక్టర్ సుందరాచారి అడగ్గానే పూర్వ విద్యార్థి డాక్టర్ భవనం హనుమ శ్రీనివాస రెడ్డి, ఆయన మిత్రులు రూ. 80 లక్షలతో రెండు బస్సులు విద్యార్థుల కోసం తొలిసారి విరాళంగా ఇచ్చారు. హాస్టళ్లలో క్రికెట్, క్రీడా మైదానాలు, సామగ్రి సైతం అందించారు. పూర్వ విద్యార్థి డాక్టర్ నలమోతు శరత్ చంద్రకుమార్ తన తల్లి శైలజకుమారి జ్ఞాపకార్థం రూ. 6 లక్షలు విరాళంగా ఇవ్వడంతో కళాశాలలో అంతర్గత రోడ్లను నిర్మించారు. పూర్వ విద్యార్థి డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ రూ. 7 లక్షలు విరాళం ఇవ్వడంతో కళాశాల ప్రధాన ద్వారాన్ని నిర్మించారు. పూర్వ విద్యార్థి డాక్టర్ జె.నరేష్‌బాబు కుటుంబం రూ. 40 లక్షలు విరాళం ఇవ్వడంతో క్యాంటీన్ నిర్మిస్తున్నారు. రూ. 10 లక్షలతో ఎగ్జామినేషన్ హాలును ఏర్పాటు చేశారు. వాటర్ కూలర్లు, లెక్చర్ గ్యాలరీలు, వైద్య విభాగాల ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. కళాశాల ప్రాంగణం విద్యుత్తు కాంతులీనేలా చర్యలు తీసుకున్నారు. కళాశాల ఆవరణం పచ్చదనం ఉట్టిపడేలా గ్రీన్ మ్యాట్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. చెట్ల కాండాలకు రంగులు వేయించారు. గెస్ట్ ఫ్యాకల్టీ భవనం, లైబ్రరీ, విగ్రహాలు, ఫౌంటేన్‌లను ఆధునికీకరించారు. వైద్య విద్యార్థులకు, బోధనా సిబ్బందికి ప్రత్యేక వెల్‌నెస్ క్లినిక్‌ను ఏర్పాటు చేయించారు. ఇలా చేసిన ప్రగతి గురించి పది నిమిషాల నిడివి కలిగిన వీడియోను రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు చూపించారు. డాక్టర్ సుందరాచారిని ఆయన అభినందించారు. ఇతర కళాశాలలకు గుంటూరు కాలేజ్ రోల్ మోడల్‌గా పేర్కొన్నారు. పలువురు ఉన్నతాధికారులు కూడా ప్రిన్సిపల్‌పై ప్రశంసలు కురిపించారు.

వారి సహాయం మరువలేనిది



గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం మరువలేనిది. దేశంలోని టాప్ వంద కళాశాలల్లో నిలబెట్టడమే ధ్యేయం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పూర్వ విద్యార్థులు, పుర ప్రముఖులు సాయం చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. బోధన, వసతుల్లోనూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం. మాతృ సంస్థకు సేవ చేయడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, ప్రిన్సిపల్

నలుగురిపై పీడీ చట్టం అమలు

మరికొందరిపై పీడీ చట్టం ప్రయోగానికి ప్రతిపాదనలు

నగరంపాలెం: జిల్లాలోని మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ (పీఎస్), చేబ్రోలు పీఎస్, వట్టిచెరుకూరు పీఎస్, తెనాలి మూడో పట్టణ పీఎస్ పరిధిలోని నలుగురిపై పీడీ చట్టం నమోదైనట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పీఎస్‌ల పరిధిలో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం ప్రయోగానికి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ ఆమోదించారని అన్నారు. దీంతో మంగళగిరి పట్టణం బాప్టిస్ట్‌పేటకు చెందిన బుల్లా మనోజ్ అలియాస్ సన్నీ అలియాస్ సుత్తివేలు, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన అల్లం సాయిసాంబశివరావు అలియాస్ సాయి, చేబ్రోలు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన పోతినేని గోపిలను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించగా, తెనాలి పట్టణం యడ్ల లింగయ్యకాలనీకి చెందిన తలవరస విజయబాబు అలియాస్ అప్పుని ఇటీవల కేంద్ర కారాగారానికి తరలించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మరికొందరిపై కూడా పీడీ చట్టం ప్రయోగానికి ప్రతిపాదనలు పంపించామని, ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత పీడీ చట్టం అమలు చేస్తామని పేర్కొన్నారు.

వంతెన పనులు వేగవంతం చేయాలి

- 'శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి'పై జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్
- సంబంధిత శాఖలు సమన్వయంతో సాగాలని ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ

లక్ష్మీపురం: శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ చాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్‌తో కలిసి వంతెన పనులపై వివిధ శాఖలు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో ఎ.భార్గవ్ తేజ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులకు సంబంధించి పిల్లర్ల నిర్మాణం రెండు వారాల్లో ప్రారంభించేలా నిర్మాణ ఏజెన్సీని సమన్వయం చేసుకుంటూ అధికారులు ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణ ఏజెన్సీకి హిందూ కళాశాల వైపు, లాడ్జి సెంటర్ వైపు ఫ్రీ కాస్ట్ మెటీరియల్ సిద్ధం చేసుకోవడానికి గుర్తించిన స్థలాలను మరోసారి పరిశీలించి మంగళవారం నాటికి వివరాలు తెలపాలని పేర్కొన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాల తరలింపునకు విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి మున్సిపల్ శాఖకు అంచనాలు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని ఓఎస్‌డీ రూప్‌కుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ బాబు, నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ సమర్పణ రావు, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు , రైల్వే డీఈ భరత్, బీఎస్ఎన్ఎల్ డీఈలు రఘురాం, నాగరాజు, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్య, నిర్మాణ ఏజెన్సీ లక్ష్మణ్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **4,500**

మోడల్ ధర రూ. **3,600**

క్లుప్తంగా

నాటికల పోటీలు ప్రారంభం



నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో నటరత్న ఎన్టీఆర్ కళా పరిషత్ తృతీయ జాతీయస్థాయి నాటిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 28వ తేదీ వరకు జరగనున్నాయి. పశువుల ఆసుపత్రి సమీపంలో భారతీయ కళావేదిక వద్ద పోటీలు జరగనున్నట్లు పరిషత్ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలను జీబీఆర్ హ్యాచరీస్ చైర్మన్ గడ్డం బుచ్చారావు, ఈదర పెద్దబ్బాయి ప్రారంభించారు. తొలిరోజు విశాఖపట్నం కళాభినయ బృందం ఆధ్వర్యంలో 'ఓ కాశీవాస రావయ్య' నాటిక ప్రదర్శించారు. రచయితగా పీటీ మాధవ్, దర్శకుడిగా శ్రీకవి ప్రసాద్ వ్యవహరించారు. గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'మరీ అంతొద్దు' నాటిక ప్రదర్శించారు. రచయితగా ఆకురాతి భాస్కర్‌చంద్ర, దర్శకుడిగా నడింపల్లి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. సామాజిక దృక్పథానికి అద్దం పట్టేలా రెండు నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పరిషత్ పర్యవేక్షకులుగా జరుగుల రామారావు వ్యవహరించారు. కార్యక్రమాలను మువ్వా సురేష్, బండారుపల్లి సత్యనారాయణ, ఆలోకం పెద్దబ్బాయి, బండ్ల రాంచంద్, చెరుకూరి ఫణికుమార్, శాఖమూరి బాజిబాబు, బొల్లు వెంకట కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం ఈతరం ఉన్నత పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నలుగురు సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గవర్నర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లా పూసుగూడేనికి చెందిన బత్తుల రాజు, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజకు చెందిన బండారి లక్ష్మీనారాయణ, నరసరావుపేట సంజీవయ్య కాలనీకి చెందిన ఉప్పు ఎల్లయ్య, గుంటూరు శివనాగరాజు కాలనీకి చెందిన తిరుపతి వెంకట దుర్గారావులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. వీరంతా పోలీసు కంట్రోల్ రూం సమీపంలో నడిచి వెళ్లే ప్రయాణికులను బెదిరించి సెల్‌ఫోన్‌లు లాక్కుని వెళ్లి పోతుంటారని సీఐ అడపా నాగమురళి తెలిపారు.

దేశంలో నరహంతక పాలన

- ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను హతమార్చుతున్న కేంద్రం
- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లక్ష్మీపురం: దేశంలో బీజేపీ నరహంతక పాలన కొనసాగిస్తోందని, మతాల మధ్య చిచ్చు పెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బీజేపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి పాటలు, కళా రూపాల శిక్షణ శిబిరం శనివారం రెండో రోజు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకు అన్నీ అప్పగిస్తోందన్నారు. కమ్యూనిస్టు భావజాలాన్ని అంతం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల తోపాటు ఆదివాసీలను దారుణంగా హతమార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చలకు వస్తామని చెప్పినప్పటికీ కేంద్రం వారిని చంపే కార్యక్రమం చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను కేంద్రం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో సరికొత్త నాటకానికి ప్రధాని నరేంద్ర మోదీ తెర తీశారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు భయపడి మోదీ పాక్‌పై యుద్ధాన్ని ఆపేశారని తెలిపారు. విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటానికి సన్నద్ధం అవుతామన్నారు. మహాసభలకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పిల్లలను సురక్షితంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులదే

న్యాయ సేవా సదన్ సెక్రెటరీ సయ్యద్ జియావుద్దీన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: పిల్లలను సురక్షితంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులదేనని, సమాజంలో పౌరులుగా మనందరి బాధ్యత కూడా అని న్యాయ సేవా సదన్ సెక్రెటరీ సయ్యద్ జియావుద్దీన్ అన్నారు. పిల్లలు జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు చేశారు. క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు జియావుద్దీన్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. పిల్లలు తప్పిపోవడం అనేది తల్లిదండ్రులు, సమాజానికి పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో పిల్లలు కనిపించకుండా పోతున్నారని, వారిలో కొంతమంది తిరిగి వచ్చినా చాలా మంది జాడ తెలియరాలేదని తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం మూడు సంవత్సరాలలో 10వేలకుపైగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. 2022లో 83,350 మంది చిన్నారులలో 62,946 మంది బాలికలు ఉన్నారని, ప్రతి నలుగురు పిల్లలలో ముగ్గురు బాలికలున్నారని వెల్లడించారు. ప్యానల్ అడ్వకేట్ కె.కాళిదాసు మాట్లాడుతూ ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసిజర్ పోలీస్ యూనిట్ ఎలా పనిచేస్తుంది, పిల్లలు తప్పిపోతే ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేయాలి, పిల్లలు ట్రేస్ కాకపోతే ఆ కేసును సీఐడీకి ఎలా బదిలీ చేయాలో వివరించారు. జిల్లా పంచాయత్ ఆఫీసర్ సాయికుమార్, డీపీఓ, శిశు సంక్షేమ శాఖ విజయ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హనుమాన్ సాయి మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను కాలయాపన లేకుండా ఎలా ట్రేస్ చేయగలమో వివరించారు. బాల కార్మికులుగా పనిచేసే పిల్లలను గుర్తించి వారికి రక్షణ కల్పించి, వారి భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దవచ్చునో వివరించారు. కార్యక్రమంలో అన్ని రంగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ప్యానల్ అడ్వకేట్‌లు, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

27వ రోజుకు సీహెచ్‌ఓల సమ్మె

స్పందించని కూటమి ప్రభుత్వం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్ఎంలో ఆరేళ్లుగా సీహెచ్‌ఓలుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నామని, రెండేళ్లుగా మా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరవధిక సమ్మె చేస్తున్నామని గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ అన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 27వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలన్నారు. అసోసియేషన్ నాయకులతో త్వరితగతిన చర్చలు జరిపి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు టీ ప్రవళిక, జిల్లా నాయకురాలు జోత్స్న మాట్లాడుతూ ఇన్ని రోజులుగా తీవ్రమైన ఎండలలో కూడా నిరవధిక సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓలను పట్టించుకోకుండా, జీతాలు వేయకుండా, ఇన్సెంటివ్‌లు వేయకుండా తీవ్ర మనోవేదనకు కూటమి ప్రభుత్వ అధికారులను గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ, జిల్లా నాయకులు సంధ్య, దీక్షిత, రవితేజ, జీవనజ్యోతి, కె లక్ష్మి, రత్నకుమారి, క్వీన్, స్వప్న, కె.లక్ష్మి, శివ నాగేంద్రమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షులుగా బొమ్ము



బొమ్ము వెంకటేశ్వరరెడ్డి

తాడేపల్లి రూరల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ప్రచార విభాగానికి నూతన ఉపాధ్యక్షులను నియమించారు. పార్టీ ప్రచార విభాగం ఉపాధ్యక్షులుగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కాజ గ్రామానికి చెందిన బొమ్ము వెంకటేశ్వరరెడ్డి (తాతిరెడ్డి)ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకం ఉంచి నియమించినందుకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, సహకరించిన జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబుకి, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సూసైడ్ నోట్ రాసి ఇంట్లోంచి వెళ్లిపోయిన భార్య

కొత్తపట్నం సముద్రతీరం వద్ద కనుగొని భర్తకు అప్పగించిన పోలీసులు

మేదరమెట్ల: సూసైడ్ నోట్ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భార్యను పోలీసులు అత్యంత వేగంగా వెదికి తిరిగి భర్తకు అప్పగించిన ఘటన శనివారం మేదరమెట్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేదరమెట్ల గ్రామానికి చెందిన వెల్లంకి వెంకట కీర్తి తనకున్న అనారోగ్య సమస్యల వల్ల సూసైడ్ నోట్ రాసి ఈనెల 23వ తేదీ సాయంత్రం ఇంట్లో ఉంచింది. తన ఫోన్‌ను కూడా ఇంట్లోనే పెట్టి వాకింగ్‌కు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. ఎంతకీ రాకపోడంతో కుటుంబ సభ్యులు ఆ లేఖ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శనివారం చీరాల, కొత్తపట్నం, చిన్నగంజాం సముద్ర తీరాలకు వెళ్లి వెతుకుతుండగా వెంకటకీర్తి కొత్తపట్నం సముద్రతీరం వద్ద కనిపించింది. ఆమెను ఎంతో చాకచక్యంగా పట్టుకొని మేదరమెట్ల పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి ఆమె భర్త నిఖిల్‌కు అప్పగించారు. ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని తక్కువ సమయంలోనే పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో చర్చలు జరుగుతాయని తెలిపారు.

ఈ ప్రాంతాలలో..

మంగళగిరిలోని ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం రేమల్లెలోని మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్, ఒంగోలు మండలం చెరువు కొమ్ముపాలెం యరజర్ల రోడ్డులోని భగీరథ కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్, విజయవాడలోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, బాపట్ల ఇస్లాంపేటలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, పల్నాడు జిల్లా గణపవరంలోని ఎంఎల్ కంపెనీలో నిర్వహించనున్న కార్యక్రమంలో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నల్లబర్లీ కొనుగోలు చేయిస్తాం

మంత్రి అచ్చెన్నాయుడు హామీ

మార్టూరు: నల్లబర్లీ పొగాకు సాగు చేసి కొనుగోలు జరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా ఉంటామని పొగాకు కంపెనీలచే రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. స్థానిక ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కె.వెంకట మురళి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పొగాకు బోర్డు, కంపెనీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి విశేష పూజలు

1,008 అరటిపండ్లతో విశేష పూజా కార్యక్రమం



అరటి పండ్లతో విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయుడు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంతి, కల్యాణ ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులు స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేక పూజ చేశారు. అనంతరం 1,008 అరటి పండ్లతో విశేష పూజలను నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి, నైవేద్యాలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. మండల దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రికి గుంటూరు శ్రీ ప్రవంతి సంగీత కళాశాల వారి శ్రీరామాంజనే యుద్ధం, శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటికలను ప్రదర్శించారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

విదేశాల్లో ఐటీ, టెలికామ్‌లో ఉద్యోగాలు

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రీస్ దేశంలో ఐటీ, టెలికాం సేవల్లో నెట్ డెవలపర్స్, ఎంఎస్ ఎస్‌క్యూఎల్ డెవలపర్స్ ఉద్యోగాలకు అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం ఐదు సంవత్సరాల అనుభవంతో 35 సంవత్సరాల వయస్సులోపు గల యువత ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేయాలని వివరించారు. ఎంపికైన వారికి దాదాపు రూ.26 లక్షలు వార్షిక వేతనం లభిస్తుందని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులతోపాటు పాస్‌పోర్ట్, అనుభవ సర్టిఫికెట్, విద్యార్హతల సర్టిఫికెట్‌లు పొందుపరచాలని తెలిపారు. అభ్యర్థులు జ్జి ఐటు: ఛ్రజీ ఇఴఛ్ధి ఝ్చ ఇజౌౌ.జీ ఽ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో ఇంగ్లీష్ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానంలో పరీక్షించటం ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు రెండేళ్ల కాల పరిమితితో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్ట్‌ను ప్రతి రెండేళ్లకు ఒకసారి పునరుద్ధరించుకోవచ్చని వివరించారు. ఎంపికైన వారికి రూ.28 లక్షల వార్షిక వేతనంతోపాటు సామాజిక భద్రత, బీమా, నివాసం కల్పిస్తారని వివరించారు. వివరాలకు వీరాంజనేయులు 9160200652, కమాండ్ కంట్రోల్ 9988853335, 8790117279 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సిగరెట్లు స్వాధీనం

సాక్షి, అమరావతి: నకిలీ ఇన్వాయిస్లతో అక్రమంగా తరలిస్తున్న సిగరెట్లు, డిష్ వాష్ సోప్లను విజయనగరం జిల్లా రామభద్రపురంలో వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకుంది. గుంటూరు ఎంబీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట నకిలీ ఇన్వాయిస్ సృష్టించి బీహార్ నుంచి సరుకు రవాణా అవుతున్నట్టు విచారణలో తేలింది అని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చీఫ్ టాక్స్ కమిషనర్ ఏ బాబు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రూ.96 లక్షలు సిగరెట్లు, రూ.2.53 లక్షలు డిష్ వాష్లను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.


దుగ్గిరాలలో 58.6 మి.మీ. వర్షపాతం

– సగటున 25.3 మి.మీ. వర్షపాతం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 58.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పొన్నూరు మండలంలో 8.6 మి.మీ. పడింది. సగటున 25.3 మి.మీ.గా నమోదైంది. మే నెల 24వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 48.2 మి.మీ. కాగా.. ఇప్పటి వరకు 166.8 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. చేబ్రోలు మండలంలో 52.2, తుళ్ళూరు 40.6, మేడికొండూరు 38.4, ప్రత్తిపాడు 35.2, కాకుమాను 30.2, కొల్లిపర 27.4, తాడికొండ 26.8, మంగళగిరి 23.6, తాడేపల్లి 21.6, ఫిరంగిపురం 19.8, వట్టిచెరుకూరు 19, పెదకాకాని 17.2, గుంటూరు తూర్పు 14.2, గుంటూరు పశ్చిమ 12.2, తెనాలి మండలంలో 9.8 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



నరసరావుపేటటౌన్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ శనివారం తెలిపారు. నరసరావుపేట రైల్వేస్టేషన్ వద్ద కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు క్రింద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడు పింక్ కలర్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నాదెండ్ల: కారు, బైకు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై గొరిజవోలు గ్రామ పరిధిలోని సుదురుపాడు పైవంతెన వద్ద ప్రమాదం జరిగింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన తరిమెళ్ళ బోయేసు (30) తన ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. సుదురుపాడు పైవంతెన సమీపంలో బైకు, కారు ఢీకొన్నాయి. బోయేసు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.